క్లుప్తంగా

కనకదుర్గమ్మను దర్శించుకున్న రోజా



కనకదుర్గమ్మ ఆలయంలో ఆర్కే రోజా

నగరి: దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం విజయవాడ కనకదుర్గమ్మను మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. ఆలయ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి కమ్ముకున్న చీకటి తెరలు త్వరగా తొలగిపోవాలని, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ప్రజలకు మంచి జరగాలని కోరుకున్నారు.

వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న అధికారులు

నగరి: ప్రస్తుత సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన ఆయన మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డితో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించి పలు సూచనలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేజీ పురుషోత్తం, జిల్లా స్థాయి సబ్‌యూనిట్ ఆఫీసర్ శివసుబ్రహ్మణ్యం, నగరి సబ్‌యూనిట్ ఆఫీసర్ శివముని, హెల్త్ అసిస్టెంట్ బాలాజీ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించండి



రికార్డులు పరిశీలిస్తున్న వేణుగోపాల్

విజయపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన అతను ల్యాబ్ సెంటర్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణుప్రియ, సబ్ యూనిట్ అధికారులు శివమునిణి, శివ సుబ్రహ్మణ్యం సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ నాగార్జున, మేల్ హెల్త్ అసిస్టెంట్ బాలాజీ పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

పుత్తూరు: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ద్వారా అందిస్తున్న ఉచిత వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డీబీఆర్ ఆస్పత్రి సిబ్బందిచే క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ శిబిరంలో 388 మందికి వైద్య సేవలందించినట్లు తెలిపారు. వైద్యులు హనాఅంజుం, అశోక్‌వర్ధన్, సురేష్, పల్లవి, సస్యశ్రీ, ప్రకాష్‌రావు, హెడ్‌నర్స్ రమాగౌరీ, ఫార్మాసిస్ట్ అన్నాదురై, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి

కార్వేటినగరం: సమతుల పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాముఖ్యత, మహిళలు, పిల్లల్లో రక్తహీనత లేకుండా ఉండాలనే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పిల్లల్లో ఊబకాయం, తగ్గించాలంటే జంక్‌ఫుడ్ తినకుండా చూడాలని చెప్పారు. అనంతరం డీఎం పురం ఆయుర్వేద కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దీపిక మాట్లాడుతూ మహిళలు క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించి చికిత్స పొందితే వ్యాధి నుంచి బయటపడవచ్చన్నారు. ఈ క్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను సందర్శించి సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు అందని వైద్యం

మహిళలకు ప్రతి కాన్పు మరో జన్మ అని నానుడి. అంటే ప్రసూతి సమయం వారికి ఎంత క్లిష్టతరంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ స్థితి నుంచి నవ్వుతూ పండంటి బిడ్డను ఎత్తుకొని ఇంటికెళ్లాల్సిన మహిళలకు నేడు పుత్తూరు ఆస్పత్రిలో ఆ పరిస్థితి లేదు. రాత్రి, పగలు తేడా లేకుండా కాన్పు కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు ఇక్కడ ప్రసూతి డాక్టర్ లేరంటూ సమాధానం రావడంతో మానసికంగా కుంగిపోతున్నారు. తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వ్యయ ప్రయాసాలతో వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుస్థితికి కారణం పుత్తూరు ఆస్పత్రిలో గత నాలుగు నెలలుగా గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉండడం. –పుత్తూరు



ఓపీ కోసం వేచి ఉన్న మహిళలు

- 4 నెలలుగా గైనకాలజిస్టు పోస్టు ఖాళీ
- గతంలో నెలకు 150 కాన్పులు
- ప్రస్తుతం 10 కాన్పులకు కష్టం
- కాన్పు కోసం వచ్చే ప్రతి ఒక్కరినీ తిరుపతికి రెఫర్
- ఇదీ పుత్తూరు ఆస్పత్రి దుస్థితి



పుత్తూరు ఆస్పత్రి

పుత్తూరు ఆస్పత్రికి 122 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. బ్రిటీష్ హయాంలో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి నేటికీ ఏడు మండలాలకు కేంద్ర బిందువుగా ఉంది. వడమాలపేట, కార్వేటినగరం, వెదురుకుప్పం నారాయణవనం, పిచ్చాటూరు, నింద్ర మండలాల నుంచి ప్రతిరోజూ 600 నుంచి 700 మంది రోగులు వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తుంటారు. వీరిలో అధిక భాగం మహిళలు ఉంటారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి విశేష కృషిచేసింది. సిబ్బందిని పూర్తి స్థాయిలో ఉంచి వైద్య సేవలందించింది. ప్రసూతి వైద్య సేవల కోసం పెద్ద సంఖ్యలో వచ్చే మహిళలకు రోజుకు కనీసం నలుగురంటే నెలకు 120 వంతున 150 వరకు కాన్పులు చేసేవారు. గతంలో ఆ స్థాయిలో వైద్య సేవలు ఉండేవి. ప్రస్తుతం గైనకాలజిస్టు పోస్టు గత నాలుగు నెలలుగా ఖాళీగా ఉండడంతో కాన్పుల సంఖ్య 10కి పడిపోయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. ప్రసవాలు, గర్భధారణ సమస్యలు, ఇతర మహిళా వ్యాధులతో వచ్చే రోగులు సరైన చికిత్స అందక ఇబ్బందులు పడుతున్నారు.

లాంగ్ లీవ్‌లో గైనకాలజిస్టు

గతంలో ఇక్కడ పనిచేస్తున్న గైనకాలజిస్టు డాక్టర్ హిమబిందు గత జూన్‌లో 30 రోజులు లాంగ్ లీవ్ కింద వెళ్లారు. అయితే ఆమె నేటికీ విధులకు హాజరు కావడం లేదు. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం విచారకరం. సమీప కార్వేటినగరం ఆస్పత్రిలో ఇద్దరు గైనకాలజిస్టులు ఉండగా అందులో ఒకరిని ఇక్కడికి డిప్యుటేషన్ అయినా వేయవచ్చు. కనీసం ఆపని సైతం చేయకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుకు అద్దం పడుతోంది.



వైద్యసేవల కోసం వేచివున్న గర్భిణులు

గైనకాలజిస్ట్ లీవ్ నిజమే..



ఇక్కడ పనిచేస్తున్న గైనకాలజిస్టు లీవ్‌పై వెళ్లిన మాట వాస్తవమే. లీవ్ పూర్తయినా ఆమె ఎలాంటి సమాచారం ఇవ్వకనే విధులకు హాజరు కావడం లేదు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ఇక్కడ ప్రసూతి కోసం వచ్చే మహిళల తాకిడి ఎక్కువగానే ఉంది. గైనకాలజిస్టు డాక్టర్ సేవలు ఇక్కడి ఆస్పత్రికి ఎంతో అవసరం.

–డాక్టర్ జి.చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్, పుత్తూరు

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



పౌష్టికాహారం ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పాలసముద్రం: మహిళలు బలంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని వైద్యాధికారులు మోహన్‌కృష్ణ, జయకుమార్ తెలిపారు. బుధవారం నరసింహపురంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభి యాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి జయకుమార్ క్యాన్సర్, ఇతర వ్యాధులపై మహి ళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్ర సిబ్బంది, 104 వాహన డీఈఓ శరవణన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరి ఎంపీడీఓగా వాణి



వాణి

నగరి: నగరి ఎంపీడీఓగా కె.వాణి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న ఈమె పదోన్నతిపై నగరికి ఎంపీడీఓగా వచ్చారు. నగరి ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న కృష్ణారెడ్డి నూతన ఎంపీడీఓ కె.వాణికి బాధ్యతలు అప్పగించారు.

శ్మశానానికి దారి చూపండి



రోడ్డుపై బైటాయించిన గుడికంద్రిగ గ్రామస్తులు

- రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేస్తున్న గుడికంద్రిగ గ్రామస్తులు

నగరి: జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా గుడికంద్రిగ గ్రామం వద్ద శ్మశానానికి వెళ్లే దారి మూసుకుపోవడంతో గ్రామస్తులు ఆగ్రహంతో రోడ్డెక్కారు. శ్మశానానికి మృతదేహాలను ఎలా తీసుకెళ్లాలో అధికారులే చెప్పాలంటూ తచ్చూరు జాతీయ రహదారిపై షామియానా వేసి భీష్మించుకు కూర్చున్నారు. రోడ్డు పనులకు వెళ్లే గ్రావెల్ టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై టిప్పర్లు ఆగిపోయి బారులుతీరాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ రవికుమార్, జాతీయ రహదారి అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. ఈ అంశంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తప్పనిసరిగా గుడికంద్రిగ వద్ద శ్మశానానికి వెళ్లేందుకు గేటు వేసి దారి వసతి కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.

అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే అబద్ధాలు

- అసెంబ్లీలో కృతజ్ఞతలు..గల్లీలో నిరసనలు
- అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే అబద్ధాల మేళవింపు



పుత్తూరులో మరమగ్గ కార్మికుల ఆందోళన (ఫైల్)

నగరి: మరమగ్గ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేశాం ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు అంటూ నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలను చెబుతుంటే మరమగ్గ కార్మికులు, చేనేత కార్మికులు ముక్కున వేలేసుకుంటున్నారు. మొన్నే కదా పుత్తూరులో మరమగ్గ కార్మికులందరూ కలిసి 500 యూనిట్ల హామీ నెరవేర్చాలంటూ నిరసన ర్యాలీ నిర్వహించి విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశాం. అసెంబ్లీలో ఎమ్మెల్యే ఏంటి ఉచిత విద్యుత్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారంటూ నివ్వెరపోతున్నారు. గత నెల 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఉచితవిద్యుత్ అమల్లోకి వచ్చినట్టు చంద్రబాబు చెప్పిన మాటలకు ఉబ్బితబ్బిబ్బైన చేనేత, మరమగ్గ కార్మికులు సెప్టెంబర్ నెలలో 100 యూనిట్లు దాటినా విద్యుత్ బిల్లులు చేతిలో పెట్టి ఉచిత విద్యుత్ అమలు చేయకుండా కూటమి సర్కార్ మోసం చేయడం, విద్యుత్ చార్జీలు సైతం ఊహించని విధంగా పెరిగిపోవడంపై విమర్శలు గుప్పిస్తుంటే ఎమ్మెల్యే అసెంబ్లీలో చెప్పిన మాటలు మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందాన మారింది. మరోవైపు మరమగ్గ కార్మికులకు యూనిఫామ్ ఆర్డర్లు కొంతైనా ఇవ్వాలని కోరడం, మరమగ్గ కార్మికులకు కుట్టుకూలి కూడా దక్కడం లేదనడం మరమగ్గ పరిశ్రమపై ఆయనకు ఏమాత్రం పట్టుందో ఇట్టే తెలిసిపోతోందని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. కరోనా పరిస్థితుల్లో ఆర్డర్లు లేక చతికిలబడ్డ మరమగ్గ పరిశ్రమకు మాజీ మంత్రి చొరవతో అప్పటి ప్రభుత్వం యూనిఫామ్ ఆర్డర్లు అందించిందన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వాలంటే అందుకు కమిటీ వేయాలనడం, ఆర్థిక పరిస్థితులు చూసుకోవాలనడం విడ్డూరంగా ఉందంటూ విమర్శలు గుప్పించారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే కేసులు



ర్యాలీలో కమిషనర్, విద్యార్థులు

పుత్తూరు: మానవుని మనుగడకు పెను ప్రమాదకారి అయిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ కోరారు. బుధవారం స్వచ్ఛ భారత్ మిషన్లో భాగంగా స్వచ్ఛతా హీ సేవ-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ ప్లాస్టిక్ కవర్లు వినియోగించినా జరిమానా విధించడంతో పాటు, ఇకపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

పీ4 సర్వేను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సతీష్

పాలసముద్రం: మండల పరిధిలో పీ4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ సతీష్ తెలిపారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పీ4 కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ మండలంలో ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు సిబ్బందిని మ్యాపింగ్ చేశామన్నారు. మండల విస్తరణాధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవరుచుకోవాలి



బహుమతులు ఇస్తున్న ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి

పుత్తూరు: విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవరుచుకోవాలని, ఇందుకు ఎన్‌ఎస్‌ఎస్ సరైన మార్గమని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మంజునాథ, అధ్యాపకులు ఏకాంబరాచారి, అమ్ముదేవి, ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ తిరుమలరాజు, ప్రిన్సిపల్స్ ఎస్వీకుమార్, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ఎన్‌ఎస్‌ఎస్‌ది ప్రధాన పాత్ర





మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్, విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ మంజుల

నగరి: సమాజ సేవలో ఎన్‌ఎస్‌ఎస్‌ది ప్రధాన పాత్రని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వేణుగోపాల్ అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌డేను పురస్కరించుకుని కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిని ఆదర్శపౌరుడిగా తీర్చిదిద్దడంలో ఎన్‌ఎస్‌ఎస్ పాత్ర వహిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కరరాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.గోపి, ఐక్యూ కోఆర్డినేటర్ డా.ఇందిరా ప్రియదర్శిని, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డా.భాస్కర్, సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ డా. అరుణకుమారి, లాల్ బాషా, కుమారి, శ్రీజోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌డేను పురస్కరించుకుని విద్యార్థులకు సమాజసేవలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రిన్సిపల్ జి.మంజుల ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి బ్రహ్మానందం, అధ్యాపకులు సుదర్శన్‌బాబు, బాషా, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చాముండేశ్వరి, ఉషారాణి పాల్గొన్నారు.

నిస్వార్థమే లక్ష్యంగా ఎన్‌ఎస్‌ఎస్ సేవలు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి

కార్వేటినగరం: నిస్వార్థ సేవలకు ఎన్‌ఎస్‌ఎస్ స్వచ్ఛంద సేవకులు ఎప్పుడూ ముందుంటారని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో ఉత్తమ రేపటి కోసం యువత స్ఫూర్తితో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజసేవ చేయడంలో ఎన్‌ఎస్‌ఎస్ స్వచ్ఛంద సేవకులు ఎప్పుడూ ముందుండాలని సూచించారు. అనంతరం అన్నా గౌరీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ గోమతి మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రక్తదాన శిబిరంలో విరివిగా పాల్గొనాలని సూచించారు. సమాజ సేవ చేయడంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఉత్తమ వేదికగా నిలుస్తోందనేందుకు ఇదే నిదర్శనంగా ఆయన కొనియాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం అందించి సామాజిక స్పృహ కలిగి ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అన్నా గౌరీ హాస్పిటల్ వైద్య సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పలువురు పాల్గొన్నారు.

జగజ్జననీ ప్రణమామ్యహం

- భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు



పుష్పపల్లకీలో చెవుటి గంగమ్మ, అన్నపూర్ణగా దేశమ్మ , ఓంశక్తి ఆలయంలో..

నగరి: నియోజకవర్గంలోని దేవీ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో మూడవ రోజైన బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నేత్ర ప్రదాయిని క్షేత్రంలో దేశమ్మ దేవత అన్నపూర్ణ అలంకరణలో, బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి చంద్రగంట అలంకారంలో భక్తులను కటాక్షించారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

బాలాత్రిపుర సుందరి దేవిగా..

శ్రీరంగరాజపురం: దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మూలూరు, పిళ్లారికుప్పం గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. అర్చకులు వేకువజామున అర్చనలు, అభిషేకాలు చేశారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో వెలసిన శ్రీ అల్లియల్లమ్మ దసరా నవరాత్రి ఉత్సవంలో భాగంగా రెండవ రోజు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూల ఉత్సవమూర్తులను ఆలయ అర్చకులు ఆనంద అయ్యగార్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకం నిర్వహించారు. ఉభయదారులుగా వెంకటాపురం గ్రామస్తులు కరుణాకరాచారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. గంగాధరనెల్లూరు దిగువూరు గ్రామానికి చెందిన రవిచంద్రరెడ్డి, చిట్టెమ్మ, చరణ్‌రెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మీనాక్షీదేవిగా ద్రౌపదీదేవి

పుత్తూరు: నవరాత్రి ఉత్సవాల్లో పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులు దర్శన భాగ్యం కల్పించారు. ద్రౌపదీదేవి, ఆరేటమ్మలను మీనాక్షీదేవిగా, కామాక్షీదేవిని అన్నపూర్ణగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కామాక్షిదేవీ కరుణించగ రావా..

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం శ్రీబంగారమ్మ కామాక్షమ్మ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు చాముండేశ్వరి, శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అమ్మవారిని కామాక్షిదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



పుత్తూరు: మీనాక్షీదేవిగా ద్రౌపదీదేవి, మీనాక్షీదేవి అలంకరణలో ఆరేటమ్మ, కామాక్షమ్మదేవిగా బంగారమ్మ

ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

శర్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలత్తూరు సమీపంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రంలో శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఆలయంలో 7 గంటల నుంచి అమ్మవారికి అభిషేకం, ఆరాధన ప్రాకారోత్సవాలు నిర్వహించారు.

పార్వతీ పరమేశ్వరుల అలంకరణలో ..

పాలసముద్రం: బలిజకంద్రిగలోని చెవుటి గంగమ్మతల్లి, మిద్దినత్త గ్రామంలో వెలసిన పడవేటమ్మ, మండల సరిహద్దు నొచ్చిలిలోని గిరిరాజా కన్యకా పరమేశ్వరీ సమేత అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం పడవేటమ్మతల్లిని సరస్వతి దేవిగా, పరమేశ్వరి దేవి అమ్మవారు పార్వతీపరమేశ్వరుల అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో మొక్కులు ఉన్న మహిళలు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మెగా వైద్యశిబిరం

నగరి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి అన్నారు. పలువురు వైద్యనిపుణులు ఈ క్యాంపులో పాల్గొంటారని రక్తపోటు, మధుమేహం, నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ సంబంధిత వైద్యచికిత్స అందిస్తారన్నారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.